# స్వేచ్ఛ

-యస్.డి.వి.అజీజ్

ఇనుప చువ్వలపై లాఠీతో కొట్టిన శబ్దం.

చువ్వలకు ఓవైపు తలాన్చి కళ్ళు మూసుకుని పరధ్యానంగా వున్న నేను ఆ శబ్దానికి కళ్ళు తెరిచి చూసాను.

నైట్ డ్యూటీలో వున్న సెంట్రీ.

మౌనంగా అతని వంక చూసాను.

"ఏంటి నిద్ర పోతున్నావు? కళ్ళు తెరుచుకుని కాపలా కాయి. అంతగా నిద్ర వస్తూ వుంటే వెళ్లి ముఖం కడుక్కుని పడుకున్న ఖైదీల మధ్య అటూ ఇటూ తిరుగు నీ డ్యూటీ టైం అయిపోయేవరకూ'' అంటూ మరోమారు ఇనుప చువ్వలపై శబ్దం చేసి వెళ్లిపోయాడు.

ఓ మారు ఖైదీలవంక చూసాను.

అందరూ నిద్రలో ఉన్నారు. నాతోపాటు వారందరూ వివిధ నేరాలు ఆరోపించబడి రిమాండ్‌కు రాబడినవారే.

నేనున్న బ్యారక్‌లో దాదాపు నలభైమందిదాకా ఖైదీలున్నారు. నేనున్న సబ్‌జైల్‌లో మొత్తం నాలుగు బ్యారక్‌లున్నాయి. రెండువందలకుపైబడి ఖైదీలున్నారు.

ఉదయం ఆరింటికి అన్ని బ్యారక్‌లు ఓపెన్ చేసి ఖైదీలను బయటకి వదులుతారు. ఏడింటికి టీ అనబడే వేడి నీళ్లు. ఎనిమిదింటికి టిఫిన్ అనబడే ఖిచిడీ, పల్చటి నీళ్ల పచ్చడి. తలా ఓ ముద్ద పళ్లెంలో పెట్టి నీళ్లపచ్చడి పోస్తారు. ఉడికీ ఉడకని ఖిచిడీ అన్నం. రుచీపచీలేని పచ్చడి నీళ్లు. మొదటి రెండురోజులూ సహించలేదు. మూడోరోజు తినక తప్పిందికాదు. పదకొండింటికి భోజనం. పల్చటి పప్పునీళ్ళు, సరిగ్గా ఉడకని అన్నం, ఓ గ్లాసులో మజ్జిగలాంటి పెరుగు.

పన్నెండింటికి అందర్నీ బ్యారెక్స్‌లోకి తోసేసి తాళం వేస్తారు. తిరిగి నాలుగింటికి తెరుస్తారు. మళ్లీ టీ అనబడే వేడి నీళ్ళు. అయిదింటికి ఉదయంలాంటి భోజనం. సాయంకాలం ఆరింటికి బ్యారక్‌లోకి తోసివేత. ఖైదీలు ఆత్మహత్యలాంటి ప్రయత్నం చేయకుండా చెరి నాలుగు గంటల పాటు ముగ్గురు కాపలా కాయాలి. అలాగే వంతులవారీగా బ్యారక్ శుభ్రపరచుకోవాలి. బయటకి రాబడినప్పుడు బ్యారక్ ముందు వూడ్చి శుభ్రం చేయాలి.

ఖైదీలు స్నానం చేయడానికి ఓ పెద్ద నీళ్లతొట్టి. నా ఒంటిపై వున్నది ఒకే జత.

జైలు సిబ్బంది ఇచ్చిన బట్టల సబ్బుతోనే పలుమార్లు ఉతుక్కుని తొడుక్కోవాల్సి వచ్చింది.

ప్రతి ఖైదీలోనూ ఒక్కోరకమైన బాధ. ఒకరి బాధను, గాధను మరొకరి దగ్గర వెళ్లబోసుకోవడం, తాత్కాలిక ఉపశమనం పొందడం.

"నువ్వు ఏ నేరంపై వచ్చావు?''

ఏం చెప్పాలి?

మౌనం వహించాను.

"ఫర్వాలేదు చెప్పు. మేమంతా మా గురించి చెప్పుకోలేదా? ఏం చెప్పుకోక, ఎవరికి వారుగా వుంటే ఇక పొద్దేం పోతుంది? మనసులోని బాధ మరింతగా పెరుగుతుంది. మనసులో బాధ తగ్గించుకోవడానికైనా చెప్పుకోవాలి.''

అయినా నా నోటినుంచి మాట పెగల్లేదు.

"సరే నీ ఇష్టం. చెప్పుకోకపోతే చెప్పుకోకపోయావుగానీ అందరితో కలివిడిగా ఉండు.''

"ఊ'' అన్నానేగానీ చనువుగా ఉండలేకపోయాను.

వివిధ నేరాలపై రాబడి నెలల తరబడి బెయిల్ దొరక్క కొందరు, బెయిల్ ఇచ్చేవారు లేక, బయటకి రాలేక కొందరు, బయటకి నవ్వుతూ అగుపించినా లోలోపలే నలిగిపోతున్నారు. ముఖ్యంగా బెయిల్ ఇచ్చేవారులేక, ఆపాదించబడిన నేరం చిన్నదైనా అందుకు శిక్ష చిన్నదైనా అంతకుమించి ఎక్కువకాలం శిక్షార్హులుగా వుంటూ కుమిలిపోతున్నవారి గురించి. చాలామంది సంవత్సరాల తరబడి బ్యారక్స్‌లో మగ్గుతున్నారు. అలాంటి వారందరూ పేదవారే. రేపు ఉదయం నేరం రుజువు కాక వీరు విడుదల అయితే చేయని నేరానికిగానూ ఖైదీగా వుంటూ అనుభవించిన శిక్షా కాలానికి పడ్డ మానసిక వేదనకు ఎవరు పరిహారం ఇవ్వాలి.

పేదవాడు ప్రతిచోట నలిగిపోతూ యాతన పడుతూనే వుంటాడు.

పడుకున్న ఖైదీల వంక చూసాను. ఏ కొందరు మాత్రమో గాఢనిద్రలో ఉన్నారు. చాలామందిలో కలత నిద్రే. అందుకు అంతరంగ క్షోభ ఒక కారణమైతే, ఉడికీ ఉడకని అన్నం తినడంవల్ల రేగిన కడుపులో మంట. ఆ మంటకు ఏవో మందులిచ్చినా మంట మాత్రం తగ్గదు. ఎందుకంటే ఆకలి తీర్చుకోవడం కోసం రోజూ ఉడికీ ఉడకని అన్నమే తినాలి కాబట్టి.

నావంతు కాపలా సమయం పూర్తి కాగానే మరొకన్ని నిద్రలేపి నేను పడుకున్నాను. కళ్లు మూసుకున్నానేగానీ నిద్రరావడంలేదు. ఇద్దరు మనుష్యుల మధ్య అవగాహన లోపించినప్పుడు అపార్థాలు చోటు చేసుకుంటాయి. ఫలితంగా ఆవేశకావేశాలు. నాకూ ఓ వ్యక్తికీ మధ్య అదే జరిగింది. ఫలితంగా ఆవేశాలు పెరిగాయి. ఆ వ్యక్తి ఇచ్చిన న్యూసెన్స్ కేసు పేర నమోదయి చివరికి నన్నిక్కడికి చేర్చింది. ఆ వ్యక్తిపై ఆవేశపడ్డా వ్యక్తిగత ద్వేషం మాత్రం నాలోలేదు. ఆవేశం మనిషిని ఏ స్థాయికైనా తీసుకువెళ్తుందని అనుభవపూర్వకంగా తెలిసొచ్చింది. బుర్ర నిండా నాకూ ఆ వ్యక్తికి జరిగిన ఘర్షణ తాలూకు ఆలోచనలే. ఆ ఆలోచనలతో మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.

★★★

అండర్‌ట్రైల్ ఖైదీల్లో చాలామంది నిరక్షరాస్యులే. వారికి ఉత్తరాలు రాసి పెట్టడం, వచ్చిన ఉత్తరాలు చదివి పెట్టడం ద్వారా పొద్దుపుచ్చుకోవడం అలవాటు చేసుకున్నాను.

ఖైదీల ప్రతి ఉత్తరంలోనూ కుటుంబ సభ్యుల గురించి దిగులు. వచ్చే ఉత్తరాల్లో కుటుంబ సభ్యుల ఆందోళన.

బెయిల్ వచ్చిన వారి ముఖాల్లో ఆనందం. వారికి, బెయిల్ రానివారు, తెచ్చుకోలేనివారు, ఉత్సాహంగా వెళ్లి చేతులు కలపడం, తమ ఆనం

దాన్ని వ్యక్తం చేయడం నిత్యకృత్యం.

బెయిల్ పొందినవారు బయటకు వెళ్తుంటే 'తిరిగి తామెప్పుడు బయటకి వెళ్తామా?' అని బాధపడడం. పంజర జీవితం అంటే పక్షులు ఎందుకు భయపడతాయో, జైలు జీవితం అంటే వ్యక్తులు ఎందుకు గాబరా పడతారో ప్రత్యక్షంగా అర్థమయింది. మనిషి స్వేచ్ఛా జీవి.

దేన్నయినా కోల్పోవడానికి సిద్ధపడతాడుగానీ స్వేచ్ఛను కోల్పోవడానికి సిద్ధపడడు.

★★★

పదిరోజులు గడిచాయి.

పదకొండోరోజు సాయంకాలం "మీకు బెయిల్ వచ్చింది" బ్యారక్ దగ్గరికి సెంట్రీ వచ్చి చెప్పాడు.

బ్యారక్‌లోని వారందరూ నన్ను చుట్టుముట్టి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. వారి సంతోషాన్ని చూసి పైకి చిన్నగా నవ్వానేగానీ మనసులో బెయిల్ తెచ్చుకోలేక ఏళ్ళ తరబడి మగ్గిపోతున్న వారి గురించే ఆలోచనలు.

'వారికెప్పుడు స్వేచ్ఛ?' అనిపించింది. త్వరగా అలాంటి వారికి కూడా స్వేచ్ఛ లభించాలని మన స్ఫూర్తిగా కోరుకున్నాను. పెట్టవలసిన చోట సంతకాలు పెట్టి జైలుగోడలు దాటి బయటకొచ్చి గుండెల నిండుగా వూపిరి పీల్చుకున్నాను.

స్వేచ్ఛ!

ఎవ్వరి నియంత్రణ లేని స్వేచ్ఛ!

జైలు వెలుపలి ఆవరణలో నా రక్త సంబంధీకులు అగుపించారు. వారి ముఖాల్లో కూడా నేను స్వేచ్ఛను పొందినందుకు ఆనందం.

'ఎంత గొప్పది స్వేచ్ఛ' అనిపించింది.

★

